క్లుప్తంగా

రేపు గన్నవరంలో బాలోత్సవం

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల్లో ఈ నెల 9వ తేదీన బాలోత్సవం తృతీయ పిల్లల పండుగను నిర్వహించనున్నట్లు బాలోత్సవం కమిటీ అధ్యక్షుడు గన్నె వెంకట్రావు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాలకు చెందిన పాఠశాల విద్యార్థులకు ఉదయం 9 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అకాడమిక్, సాంస్కృతిక విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇంతకు ముందు నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. ఇంకా పేర్లు నమోదు చేసుకోని విద్యార్థులు శనివారం సాయంత్రంలోపు కమిటీ వద్ద ఎన్‌రోల్ చేసుకోవాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, జెడ్పీ సీఈఓ కె. కన్నమనాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే. రామారావు, గుడివాడ డీవైఈఓ కొండా రవి కుమార్ హాజరవుతారని తెలిపారు.

పాఠశాలలు ఆదివారం పనిచేయాలి

గన్నవరం: జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు 2024–25 విద్యా సంవత్సరంలో 220 రోజులు పనిదినాలను పూర్తి చేయని పాఠశాలలు ఈ నెల 9వ తేదీన పనిచేయాలని గుడివాడ డెప్యూటీ ఈఓ కొండా రవికుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఆదేశాలను గుడివాడ డివిజన్ పరిధిలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు పరిగణలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. నిర్ణీత పనిదినాలు పూర్తికాని పాఠశాలలు తప్పనిసారిగా ఆదివార కూడా పనిచేయాలని హెచ్‌ఎంలకు తెలిపారు. రెండో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కారణంగా పనిదినాన్ని ఆదివారానికి మార్చినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: కానూరులో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. కానూరు సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో తోటలు, కానూరు బస్‌స్టాప్ ప్రాంతం, పెద్దబావి, యాదవుల బజార్, రంగా బొమ్మ సెంటర్, వృద్ధుల ఆశ్రమం రోడ్డు, కెనడీస్కూల్ ప్రాంతం, కామయ్యతోపు, జేఆర్డీ టాటా ఎస్టేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని తెలిపారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: ఉంగుటూరు సెక్షన్‌లోని నందమూరు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జి.బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మానికొండ, బొకినాల, చికినాల, నందమూరు, ఇందుపల్లి, మధిరపాడు, వేమండ, చాగంటిపాడు గ్రామాల్లో సరఫరా ఉండబోదని పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి



కంకిపాడు: అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు కంకిపాడుకు చెందిన ముప్పా కోటేశ్వరరావు (64) కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 6వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య హేమలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆస్పత్రి వర్గాల సమాచారంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాళ్వాలో కాండం తొలుచు పురుగు

నున్న(విజయవాడరూరల్): వాతావరణంలో ఏర్పడిన మార్పులతో దాళ్వా వరిలో కాండం తొలుచు ఏర్పడిందని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు తెలిపారు. రైతుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం నున్న గ్రామం విచ్చేసిన ఆయన దర్శి గోపి, పామర్తి శ్రీనివాసరావు, కోటిరెడ్డి అనే రైతుల పొలాల్లో కాండం తొలుచు పురుగులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాళ్వాలో పీఆర్ 126 అనే రకం వరిని అధికంగా సాగు చేస్తున్నారన్నారు. రెండోది 1121 రకం వరిని సాగు చేస్తున్నారని తెలిపారు. పీఆర్ 126 రకం వరిలో కాండం తొలుచు పురుగు పడటం వలన పంట పై భాగం దెబ్బతిని దిగుబడి చాలా వరకు తగ్గిపోతుందన్నారు. పొట్ట దశ నుంచి పాలుపోసుకునే దశలో ఉండడంతో కాండం పురుగు నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని రైతులకు సూచించారు. క్లోరంట్రానిలిప్రోల్ అనే పురుగు మందును ఎకరానికి 60 మిల్లీలీటర్లను అర లీటరు వేప నూనెలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

రాత్రి అయితే భయం భయం

వెలగని వీధిదీపాలు



శ్రీనగర్‌కాలనీలో రాత్రి సమయంలో వెలగని వీధి దీపాల్లో ఇది ఒకటి

గన్నవరం: గన్నవరం పంచాయతీ పరిధిలో రాత్రి అయితే అంధకారం అలుముకుంటోంది. దీంతో ప్రజలు భయం భయంగా గడుపుతున్నారు. గ్రామంలోని ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్లు సక్రమంగా వెలగకపోవడం కారణంగా పలు కాలనీలో చీమ్మచీకట్లో చిక్కుకుంటున్నాయి. మరోవైపు వీధికుక్కల బెడదతో రాత్రి వేళలో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వీధిలైట్లకు సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, విద్యుత్ సరఫరా లైన్లలో లోపాలు కారణంగా ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్ల సమస్యపై అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఎనిమిదేళ్ల క్రితం జిల్లాలో పైలెట్ ప్రాజెక్ట్‌గా గన్నవరంలో ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్లను ఏర్పాటు చేశారు. పదేళ్ల పాటు ఈ వీధిలైట్ల నిర్వహణ బాధ్యతలు చూడాల్సిన తయారీ కంపెనీ ఏడాదికే తప్పుకుంది. దీంతో అప్పటి నుంచి గ్రామపంచాయతీ నిర్వహణ చూస్తోంది. ఎల్‌ఈడీ లైట్ల నిర్వహణలో ఎటువంటి అనుభవం లేకపోయిన ఉన్న ఇద్దరు ముగ్గురు కాంట్రాక్ట్ కార్మికులతో మరమ్మతులు చేయిస్తూ నెట్టుకొస్తున్నారు.

ఆదాయం మిన్న.. సదుపాయలు సున్నా

సుమారు 30 వేలు జనాభా కలిగిన గన్నవరం మేజర్ పంచాయతీ వార్షిక ఆదాయం సుమారు రూ. 4 కోట్లుకు పైబడి వస్తుంది. ఆదాయం గణనీయంగా ఉన్నప్పటికి వీధిలైట్లు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం నిర్వహణపై పాలకులు, అధికారులు పెద్దగా దృష్టి పెట్టడం లేదు. ముఖ్యంగా వీధిలైట్లు నిర్వహణ విషయంతో పంచాయతీ తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. గ్రామపంచాయతీ పరిధిలో 1,400పైగా ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్లు ఉండగా, సుమారు 400 వరకు లైట్లు వెలగడం లేదు. అత్యంత రద్దీగా ఉండే స్థానిక శ్రీనగర్‌కాలనీలోని సెయింట్‌జాన్స్ రోడ్డు, పాత ఎస్‌బీఐ రోడ్డు, బుద్దవరం రోడ్డు, రాయ్‌నగర్‌లోని పలు వీధుల్లో వీధిదీపాలు వెలగడం లేదు. శివారు గ్రామం మర్లపాలెంలో అయితే విద్యుత్ లైన్ల సరఫరా వ్యవస్థలో లోపాలు కారణంగా ఒకేసారి 50కుపైగా వీధిలైట్లు పాడైపోయాయి. అంతేకాకుండా నేషనల్ హైవే నుంచి మర్లపాలెం వెళ్లే ఎన్టీఆర్ రోడ్డు, కాలనీకి వెళ్లే రోడ్డు, స్థానిక బోస్ బొమ్మ నుంచి స్రవంతి హైస్కూల్ వరకు ముఖ్యమైన వీధుల్లో కూడా స్ట్రీట్‌లైట్ల వెలగడం లేదు. దీంతో రాత్రి వేళలో ప్రయాణం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు సమస్యను గుర్తించి వీధిలైట్లకు మరమ్మతులు, కొత్తవి ఏర్పాటు చేయడం వంటి పనులను యుద్ధప్రతిపాదికన చేపట్టాని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం

ఇటీవల కాలంలో విద్యుత్ సరఫరా లైన్ల మధ్య అవంతరాలు కారణంగా వీధిలైట్లు పాడైపోయాయి. మరికొన్ని మరమ్మతులకు గురయ్యాయి. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– చెన్నకేశవరావు, ఈఓ, గన్నవరం

అన్ని రంగాల్లో మహిళలదే పై చేయి



ఉయ్యూరులో ఆర్‌డీఓ షారోన్‌ను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు



మాట్లాడుతున్న గైనకాలజిస్టు డాక్టర్ మైనేని పూజిత



నున్నలో టీచర్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న వక్ఫ్ సర్వే కమిషనర్ షెరీన్ బేగమ్

రామవరప్పాడు: మహిళలు అన్ని రంగాల్లో తమ సత్తా చాటుతున్నారని వక్ఫ్ సర్వే కమిషనర్ షేక్ షెరీన్ బేగమ్ అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో ఉన్నత విద్యతో పాటు క్రీడలు, పారిశ్రామిక, రక్షణ, పరిశోధన తదితర రంగాల్లో మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారన్నారు. లింగ సమానత్వాన్ని నిర్మించడంలో 'యాక్సిలరేట్ యాక్షన్' అంశంపై అవగాహన పరిచారు. అంకుర్ హాస్పిటల్ ప్రసూతి గైనకాలజిస్టు డాక్టర్ మైనేని పూజిత మాట్లాడుతూ మహిళా సాధికారత, ఉన్నత విలువలు, హక్కులు అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ బీఎస్ అప్పారావు, కార్యదర్శి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు, అకడమిక్ డీన్ కె.రమేష్ పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: మహిళలు అన్ని రంగాల్లో రాణించి స్త్రీశక్తిని చాటుతున్నారని ఉయ్యూరు ఆర్‌డీఓ హెలా షారోన్ అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆర్‌డీఓను క్లబ్ ప్రతినిధులు శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు బండి జ్యోతి, ఎండీ ఇస్మాయిల్, నూకల వెంకట సాంబశివరావు, నెల్లి రాంబాబు, దీనవహి ప్రసాద్ పాల్గొన్నారు. ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాల, ఉమెన్ ఎంపవర్‌మెంట్, ఐక్యూ ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎక్సైజ్ ఎస్ఐ నన్నపనేని కల్యాణి, మహిళాస్ఫూర్తి అధ్యక్షురాలు పడమట భువనేశ్వరీ, డాక్టర్ సుభాషిణి, అధ్యాపకురాలు కుమారి పాల్గొన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్, జూనియర్ కళాశాల డైరెక్టర్ జిజెపి వినయ్‌కుమార్, ప్రిన్సిపాల్ బుచ్చిరెడ్డి పర్యవేక్షించారు.

నున్న హైస్కూల్లో ..

నున్న(విజయవాడరూరల్): నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, ఆయాలు, వంట ఏజెన్సీ సభ్యులను సత్కరించారు. ఈ ఏడాది మేలో ఉద్యోగ విరమణ చేయనున్న తెలుగు ఉపాధ్యాయురాలు అరుణను విద్యార్థులు, హెచ్‌ఎం భూపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు సత్కరించారు. పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సురేష్, నళినీరామ్, పూర్వ విద్యార్థి సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: ప్రస్తుత తరుణంలో మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారని తహసీల్దార్ వీ.భావనారాయణ అన్నారు. మహిళా దినోత్సవ వేడుకలు కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. రెవెన్యూ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులను సత్కరించారు. డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ 100 రోజుల పని కల్పించాలి



మాట్లాడుతున్న పీడీ శివప్రసాద్

ఉంగుటూరు: జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ 100రోజులు పనిదినాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఆర్‌జీఎస్ పీడీ ఎన్.వి.శివప్రసాద్ యాదవ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా 2023–2024 ఆర్థిక సంవత్సరంలో రూ.9.48కోట్లుతో చేపట్టిన 2,251 పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ తనిఖీల్లో కూలీల మస్టర్లలో కొట్టివేతలు ఉండటాన్ని తనిఖీ బృందం గుర్తించారు. ఈ మస్టర్ల కొట్టివేతల వలన రూ.43,397 వేతనాలు అదనంగా చెల్లించారని, వాటిని రికవరీ చేసి ప్రభుత్వానికి చెల్లించాలని ఎఫ్‌ఏలను ఆదేశించారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఎస్‌ఆర్‌పీ ఎస్.అచ్యుతరావు, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ ఎన్.సురేష్, జయప్రసాద్, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏపీఓ వినీల పాల్గొన్నారు.

కొనసాగుతున్న వెటర్నరీ నిరసన



తిరుమల తిరుపతి కొండపై కొబ్బరికాయలు కొడుతున్న వెటర్నరీ విద్యార్థులు

గన్నవరం: స్థానిక ఎన్టీఆర్ పశువైద్య కళాశాల విద్యార్థులు స్టైఫండ్ పెంపు కోరుతూ చేపట్టిన సమ్మె శుక్రవారం 34వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా స్థానిక వెటర్నరీ విద్యార్థులు ఉదయం తిరుమల తిరుపతికి వెళ్లారు. తిరుపతి వెంకన్న సన్నిధిలో కొబ్బరికాయలు కొట్టి, తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా సద్బుద్ధిని ప్రసాదించాలని దేవుడిని వేడుకున్నారు. నెల రోజులకుపైగా స్టైఫండ్ పెంచాలని ఎస్వీ పశువైద్య విద్యాలయం పరిధిలోని వెటర్నరీ జూడాలు దీక్షలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమని విద్యార్థి సంఘ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కనీసం రూ. 15 వేలు స్టైఫండ్‌ను మంజూరు చేయాలని తిరుపతికి వెళ్లి శ్రీవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం కొనసాగుతుందని తేల్చి చెప్పారు.

ఏపీ మైనారిటీస్ కమిషన్ ఆదేశాలు బేఖాతర్

పెనమలూరు: అత్యంత విలువైన తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లోని వక్ఫ్ భూములు పరిరక్షించటానికి ఏపీ మైనారిటీస్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.ఇక్బాల్ అహ్మద్‌ఖాన్ ఇచ్చిన ఆదేశాలు అధికారుల బేఖాతర్ చేశారు. తాడిగడపలో 30.04 ఎకరాలు, పెదపులిపాకలో 12.82 ఎకరాల కొండపల్లి ఖాజీ సర్వీస్‌కు చెందిన వక్ఫ్ భూములకు కౌలు వేలంపాట ఎన్నికల కోడ్ అనంతరం నిర్వహించాలని ఏపీ మైనారిటీస్ కమిషన్ ఇచ్చిన ఆదేశాలు రెవెన్యూ అధికారులు తుంగలో తొక్కారు. ముస్లిం హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగుల్‌మీరా గతంలో ఈ మేరకు వక్ఫ్ భూములకు వేలంపాట నిర్వహించటంలేదని ఏపీ మైనారిటీస్ కమిషన్ ఫిర్యాదు చేశాడు. స్పందించిన ఏపీ మైనారిటీస్ కమిషన్ వక్ఫ్ ప్రాపర్టీస్ లీజ్ రూల్స్ 2014 ప్రకారం వేలంపాట వేయాలని ఆదేశించింది. జిల్లా అధికారులతో పాటు, స్థానిక రెవెన్యూ అధికారులు, వక్ఫ్ బోర్డు వక్ఫ్ భూముల వేలంపాట పై మౌనపాత్రలో ఉన్నారు. ఇది ఇలా ఉండగా పచ్చనేతలు మాత్రం విలువైన వక్ఫ్ భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి పంటలు సాగు చేస్తున్నారు. వక్ఫ్ భూములు కాపాడాలని జిల్లా వక్ఫ్ అధికారులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు. దీంతో రూ. కోట్లు విలువ చేసే వక్ఫ్ భూములకు రెక్కలు వచ్చే ప్రమాదం ఏర్పడిందని మైనారటీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భవిష్యత్ డిప్లొమా ఇంజినీర్లదే



స్మితను సన్మానిస్తున్న జేపీకేపీ యాజమాన్యం

ఉయ్యూరు రూరల్: భవిష్యత్తు అంతా డిప్లొమా ఇంజినీర్ల దేనిని ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ యూఎస్‌ఏ అధినేత దోనేపూడి స్మిత అన్నారు. మండలంలోని కలువపాముల శ్రీ జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల (జేపీకేపీ) 12వ వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ అధినేత దోనేపూడి స్మిత హాజరై విద్యార్థులకు పలు అంశాలపై గణాంకాలతో సహా వివరించారు. పాలిటెక్నిక్ విద్య రంగంలో రాష్ట్ర స్థాయిలో జ్యోతి పాలిటెక్నిక్ కళాశాల ముందుకు సాగడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తున్న సంస్థ చైర్మన్ సూరపనేని వెంకటరమణను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ ఎస్.వెంకటరమణ ప్రిన్సిపాల్ శివకుమార్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన సావిష్కార్-2కే25



విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల్లో ఆకట్టుకున్న కోలాటం



ఫ్యాషన్ షోలో ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థినులు

రామవరప్పాడు : విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కళాశాల్లో మూడు రోజులుగా జరుగుతున్న సావిష్కార్–2కే25 కార్యక్రమం శుక్రవారం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా ముగిసింది. తొలి రెండు రోజులు ప్రాజెక్ట్ ఎక్స్‌పో, టెక్నికల్ ఫెస్ట్‌లో విద్యార్థినులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. చివరి రోజు పలు విభాగాలకు చెందిన విద్యార్థినులు ఉత్సాహంగా గడిపారు. ఒక పక్క సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. పలువురు విద్యార్థులు ర్యాంపు వాక్ చేసి అబ్బుర పరిచారు. కోలాటం, సంప్రదాయ నృత్యాలు, దేవతామూర్తుల అవతారాల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం పలు విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరీ శ్రీ కృష్ణ, ప్రిన్సిపాల్ తూమాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ధనేకుల కాలేజీలో..

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ స్థాయిలో రెండు రోజులుగా జరిగిన ధనుష్–2కే25 ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కాలేజీ కార్యదర్శి ధనేకుల భవానిప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నృజనాత్మకత, సాంకేతికతను టెక్నోకల్చర్ ఫెస్టు ద్వారా ప్రదర్శించే అవకాశం కల్పించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 85 కాలేజీల నుంచి 7,500 మంది విద్యార్థులు ధనుష్‌లో పాల్గొన్నారన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఫ్యాషన్ షో అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో డైరెక్టర్ రవిప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా చైతన్యయాత్రలను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వరరావు

ఉయ్యూరు: ప్రజా చైతన్య యాత్రలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఉయ్యూరు విజ్ఞాన కేంద్రంలో కృష్ణా జిల్లా స్థాయి సీపీఎం విస్తృత సమావేశం శుక్రవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, గ్రామ సచివాలయ సమస్యలను గుర్తించి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిది నెలల్లో సూపర్‌సిక్స్ అమలుకు నోచుకోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉద్యోగ భద్రతకు ఎదురుచూస్తున్నారన్నారు. శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్రలను చేపట్టి సమస్యలపై సచివాలయాల్లో వినతులు అందించాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు పాల్గొన్నారు.

మద్యం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

హనుమాన్‌జంక్షన్ రూరల్: అక్రమంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం బాటిళ్లు నిల్వ చేసిన ఘటనలో బాపులపాడు మండలం ఎ.సీతారామపురం ఉప సర్పంచ్, టీడీపీ నేత పసుపులేటి శివశంకర్‌రావు ను స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం బాటిళ్లు తీసుకొచ్చి అక్రమంగా నిల్వ చేస్తున్నట్లుగా సమాచారం తెలుసుకున్న పోలీసులు పసుపులేటి నాని ఇంటిపై దాడి చేశారు. ఈ ఘటనలో గోవా నుంచి తీసుకొచ్చిన మద్యం బాటిళ్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆయన నివాసంలో గుర్తించారు. 10 ఫుల్ బాటిళ్లు, మరో 10 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై గన్నవరం ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సర్వేను విజయవంతం చేయండి



ఉయ్యూరు రూరల్: పి–4 సర్వేను విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేషగిరిరావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం పి–4 సర్వేపై శిక్షణ కార్యక్రమం జరిగింది. సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో పేద కుటుంబాలను గుర్తించేందుకే పి–4 సర్వే నిర్వహిస్తున్నమని తెలిపారు. సర్వేలో గుర్తించిన పేదలను దత్తత తీసుకొని వారిని ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అందుకుగాను ఈ నెల 8 నుంచి 18వ తేదీ వరకు సర్వే అన్ని గ్రామాల్లోనూ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. సచివాలయం సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలన్నారు.

నేటి నుంచి పి–4 సర్వే

ఉంగుటూరు: 2047 నాటికి పేదరికంలేని నూతన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ నెల 8నుంచి18వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పబ్లిక్, ప్రైవేట్ పీపుల్స్ పార్టీస్పేషన్(పి–4) సర్వేను గ్రామ సచివాలయ సిబ్బంది పకడ్బందిగా నిర్వహించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కే.జోగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం నుంచి ప్రారంభంకానున్న సర్వేపై మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల సిబ్బందికి స్త్రీశక్తి భవనంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

అర్ధరాత్రి అలజడి సృష్టించిన స్థల వివాదం

గన్నవరం: మండలంలోని బుద్ధవరం శివారు రాజీవ్‌నగర్‌కాలనీ సమీపంలోని ఓ స్థలంలోని సరిహద్దు రాళ్లను, కంచెను గురువారం అర్ధరాత్రి కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల కథనం మేరకు కాలనీ పరిధిలోని ఆర్ఎస్. నెం.449, 450లోని సుమారు ఎనిమిది ఎకరాలు చెరువు పోరంబోకు భూమి ఉంది. ఇందులో కొంత భాగాన్ని పేదల నివేశన స్థలాలు కోసం ప్రభుత్వం కేటాయించింది. మిగిలిన ఆర్ఎస్. నెం .449/2లోని 28.49 సెంట్లను కూడా కాలక్రమేణ పరిసర ప్రాంత పేదలు ఆక్రమించుకున్నారు. సదరు భూమి పలువురి చేతులు మారి 2011లో గొల్లనపల్లికి చెందిన దొండపాటి ధాత్రి, పురుషోత్తపట్నంకు చెందిన గుమ్మడి ఉషారాణి కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో సదరు భూమిలోని అర్ధరాత్రి కొంత మంది గుర్తుతెలియని యువకులు ప్రవేశించి సరిహద్దు రాళ్లను, కంచెను ధ్వంసం చేయడం వివాదాస్పదమైంది. దీంతో బాధితులు పోలీసులను, రెవెన్యూ అధికారులను ఆశ్రయించారు. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరపాలని, సదరు భూమి రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉంటే వదులుకోవడానికి సిద్ధంగా ఉన్నట్లు కూడా యాజమానులుగా చెబుతున్న వ్యక్తులు తహసీల్దారు కె. వెంకటశివయ్యకు తెలియజేశారు. రౌడీలుగా వ్యవహరిస్తూ సరిహద్దు రాళ్లు, కంచెను ధ్వంసం చేసిన అసాంఘిక శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.